క్లుప్తంగా

నాయీబ్రాహ్మణులకు మేలు చేసింది వైఎస్సార్‌సీపీనే



పారిశ్రామిక ప్రాంత నాయీబ్రాహ్మణ సంఘం ప్రతినిధులతో ఆనంద్‌కుమార్

మల్కాపురం : నాయీ బ్రాహ్మణులకు గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వని గుర్తింపు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిందని పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. పారిశ్రామిక ప్రాంత నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధుల ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆనంద్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నాయీబ్రాహ్మణులు తమ కులవృత్తికి సంబంధించి షాపు పెట్టుకుంటే ఆ షాపునకు 150 యూనిట్లలోపు విద్యుత్ వాడితే ఎటువంటి చార్జీ లేకుండా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. అలాగే నిరుపేదలైన నాయీ బ్రాహ్మణులకు కుల వృత్తికి సంబంధించిన సామగ్రి కొనుగోలుకు ప్రతి ఏటా నగదు సాయం, వారికి కార్పొరేషన్ పదవులు, దేవాలయాల ట్రస్ట్‌బోర్డుల్లో పదవులు, వారి పిల్లల చదువులకు సాయం వంటివి అందించారన్నారు. నాయీ బ్రాహ్మణులందరి గుండెల్లో నేడు జగన్ చెరగని ముద్ర వేశారన్నారు. గతంలో ఎలా జగన్ వెంట నడిచారో వచ్చే ఎన్నికల్లోనూ ఆయనకు అండగా ఉండి, తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. అలాగే విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యేగా తనను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. 59వ వార్డు నక్కవానిపాలెం వద్ద గల పార్టీ క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పి.వి.సురేష్, బల్లా లక్ష్మణరావు, మాజీ కార్పొరేటర్ గల్లా శ్రీను, నాయకులు ఆడారి హరీష్, జీవీఎల్ నరేష్, జీవీఎస్ఎన్ రాజు (కేబుల్ వాసు)తో పాటు పారిశ్రామిక ప్రాంత నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

దువ్వాడ రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం

అగనంపూడి: దువ్వాడ రైల్వే స్టేషన్‌లో మంగళవారం 14 కేజీల 3.10 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఆర్‌పీఎఫ్‌పీ ఎస్‌ఐ కె.శాంతారాం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖ జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ధనుంజయ నాయుడు ఆధ్వర్యంలో దువ్వాడ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారంపై తనిఖీలు నిర్వహిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి బ్యాగులో రూ.71,050 విలువ గల 14 కేజీల 3.10 గ్రాముల గంజాయిని గుర్తించారు. బ్యాగును సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు శాంతారాం తెలిపారు.

సమస్యలు చెప్పండి.. అన్నీ పరిష్కరిస్తాం



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ శశి భూషణరావు

విశాఖ సిటీ: ఏయూ హాస్టళ్లను సమస్యల రహితంగా తీర్చిదిద్దుతామని ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ శశి భూషణరావు విద్యార్థినులకు హామీ ఇచ్చారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం వర్సిటీ పరిపాలన భవనానికి ప్రిన్సిపాల్ శశిభూషణ్‌రావుకు ఇంజినీరింగ్ కళాశాల హాస్టల్ విద్యార్థినులు విన్నవించుకున్నారు. దీనికి స్పందించిన ప్రిన్సిపాల్.. 'మీ సమస్యలు చెప్పండి.. దానికి ఏం చేయాలో కూడా చెప్పండి.. తప్పకుండా అన్నీ పరిష్కరిస్తాం..'అంటూ హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థినులు హర్షం వ్యక్తం చేశారు. ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ విద్యార్థులు తమ సమస్యను హాస్టల్ వార్డెన్ దృష్టికి తీసుకువెళ్లాలని, అక్కడ పరిష్కారం కాని పక్షంలో ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రోద్బలంతోనో ఇటువంటి నిరసనలు చేపట్టవద్దన్నారు. మిమ్మల్ని ఎవరైనా వెనకుండి చెయ్యమన్నారా? అని ప్రశ్నించగా, ఓ మీడియా సంస్థ పేరు చెప్పడం ఓఎస్‌డీ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

అధికారుల సత్వర స్పందన

వర్సిటీ ఇంజినీర్ ఆర్.శంకరరావు వెంటనే విద్యార్థినుల హాస్టళ్లను ఆచార్యులతో కలిసి పరిశీలించారు.

పండుటాకులపై పగ

- పింఛన్ల కోసం తప్పని పడిగాపులు
- సచివాలయాలకు వెళ్లలేని వారి పరిస్థితి మరింత దయనీయం

వార్డు	లబ్ధిదారులు	వార్డు	లబ్ధిదారులు
		60	461
40	436	61	1072
41	830	62	927
52	690	63	635
56	1265	89	1969
57	1322	90	2220
58	1380	91	2653
59	1314	92	3745



90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్-బ్లాక్‌లో పింఛన్ కోసం నిరీక్షిస్తున్న వృద్ధులు

గోపాలపట్నం/విశాఖ విద్య/మల్కాపురం: ప్రతీ నెలా ఒకటో తేదీ అయ్యేసరికి సూరీడు కంటే ముందే వచ్చి పలకరించే వలంటీర్లతో పింఛనర్లకు నిజంగానే శుభోదయం అయ్యేది. వేకువజామునే పింఛన్ సొమ్ము చేతికందడంతో అవ్వాతాతలు, దివ్యాంగుల కళ్లలో ఆనందం వెల్లివిరిసేది. మంచానికే పరిమితమైన రోగుల కళ్లు చెమ్మగిల్లేవి. నెలకు రూ.3 వేలు ఇంటికే రావటంతో కొండంత ఆర్థిక భరోసాగా భావించేవారు. కానీ ఎన్నికల నేపథ్యంలో పింఛన్ల పంపిణీ బాధ్యత నుంచి వలంటీర్లను తప్పించడంతో వీరంతా మళ్లీ పెన్షన్ల కోసం సచివాలయాలకు వెళ్లాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. అసలే ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో వృద్ధులు, దివ్యాంగులకు ఇది ఇబ్బంది కలిగించే అంశమే.

పశ్చిమ నియోజకవర్గం పరిధిలో 14 వార్డులు ఉండగా, వీటిలోని లబ్ధిదారులకు 5, 8వ జోనల్ కమిషన్ కార్యాలయ అధికారుల పర్యవేక్షణలో వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేసేవారు. జోన్-5లో సుమారు 10,332, జోన్-8లో 10,587 మంది పింఛనుదారులు ఉన్నారు. ప్రతీ నెలా ఒకటో తారీఖు ఉదయాన్నే ఇంటికి వచ్చి వలంటీర్లు పింఛను డబ్బులు అందజేయటంతో లబ్ధిదారులు ఆనందంతో ఉప్పొంగిపోయేవారు. కానీ, టీడీపీ ప్రభుత్వం మొదటి నుంచీ వలంటీర్లపై కక్షగట్టినట్లుగానే వ్యవహరిస్తోంది. సేవాభావంతో పనిచేసే వలంటీర్లను సవ్యంగా విధులు నిర్వర్తించనీయకుండా టీడీపీ వారు ఏదో ఒక రీతిన అవాంతరాలు సృష్టిస్తూనే వస్తున్నారు. తాజాగా ఎన్నికల సమయంలో వలంటీర్లను అడ్డుకునేందుకు చేసిన కుట్రలతో అవ్వాతాతలకు పింఛన్లు అందుకునేందుకు అవాంతరాలు వచ్చి పడ్డాయి. పింఛను తీసుకునేందుకు లబ్ధిదారులే సచివాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. టీడీపీ చేసిన నిర్వాకంతోనే తమకు ఇలాంటి ఇబ్బందులు ఎదురయ్యాయని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పింఛన్‌కు వెళ్లడం కష్టమే..



నేను బాజీ జంక్షన్‌లో ఉంటున్నాను. నడవ పరిస్థితి. ఇంటికి పెన్షన్ తెచ్చి ఇచ్చే వలంటీర్‌ను ఆపేశారు. ఇప్పుడు పింఛన్ ఎలా తెచ్చుకోవాలో అర్థం కావడం లేదు. ఆరేళ్లుగా నాకు దివ్యాంగుల పింఛన్ వస్తుంది. గతంలో తెలుగుదేశం వాళ్లు ఎప్పుడు పిలిస్తే అప్పుడు, అక్కడికి వెళ్లి చాలా ఇబ్బంది పడేవాళ్లం. జగన్ బాబు వచ్చాక ఇంటికే పింఛన్ వస్తుంది. బాధలు తీరాయనుకుంటే మళ్లీ ఇబ్బందులు పెడుతున్నారు.

– దుంగ రామలక్ష్మి, బాజీ జంక్షన్, 91వ వార్డు

పాత రోజులు గుర్తొస్తున్నాయి



నాకు వితంతు పింఛన్ వస్తుంది. జగన్ బాబు వచ్చాక వలంటీర్లు ఒకటో తేదీ ఉదయాన్నే ఇంటికి వచ్చి పింఛను ఇచ్చి ఆప్యాయంగా పలకరించేవారు. ఎంతో ఆనందపడ్డాం. ఇప్పుడు పింఛన్ ఇంటికి రాదంటే పాత రోజులు గుర్తొస్తున్నాయి. చంద్రబాబు హయాంలో కిలోమీటర్ల దూరం వెళ్లి పింఛను తీసుకునేవాళ్లం. ఇపుడు అదే పరిస్థితి వస్తుందేమోనని భయంగా ఉంది. కాళ్ల నొప్పులతో బాధపడుతున్నా. ఇప్పుడు పింఛను కోసం ఎక్కడికి వెళ్లాలి.

– ఎస్‌కే బేగం, చిన్న బుచ్చిరాజుపాలెం రెడ్డి వీధి

నెలంతా ఎదురు చూస్తాం



నాకు వృద్ధాప్య పింఛన్ వస్తుంది. వలంటీర్ ప్రతీ నెలా ఒకటో తేదీన తెల్లవారుజామునే పింఛన్ తెచ్చి ఇచ్చేవారు. ఈ రోజు పింఛన్ డబ్బు రాకపోయేసరికి చాలా బాధేసింది. నెలంతా ఈ పింఛను కోసం ఎదురు చూస్తాం. ఇపుడు వలంటీర్లు ఇవ్వరని తెలిసింది. సచివాలయాలకు వెళ్లాలని చెప్పారు. అక్కడికి వెళ్లాలంటే బీఆర్టీఎస్ రోడ్డు దాటాలి. ఒక్కదాన్ని వెళ్లలేను. ఎవరో ఒకరిని తోడు తీసుకుని వెళ్లాలి. ఎంతసేపు ఉండాలో తెలియదు. వలంటీర్లు ఇంటికి తెచ్చి పింఛన్ ఇచ్చేవారు. ఎందుకు ఇలా చేశారో తెలియదు. చాలా బాధగా ఉంది.

– కోసూరి లక్ష్మి, బాజీ జంక్షన్

మాలాంటి వారికి ఎలా?



అవసాన దశలో మంచాన పడి ఉన్నాను. ఎక్కడికీ వెళ్లలేని దుస్థితి నాది. వలంటీర్ ప్రతీ నెలా ఇంటికి పింఛన్ ఇచ్చేవారు. మందులకు, ఖర్చులకు నాలుగేళ్లుగా ఏ ఇబ్బంది లేదు. ఇప్పుడు వాళ్లు ఇవ్వకూడదని చెప్పారట. నేను ఎలా వెళ్లగలను? ఎందుకిలా మాలాంటి వారిని బాధ పెడుతున్నారు?

– సూరిబాబు, శ్రీరామ్‌నగర్, గోపాలపట్నం

మా పరిస్థితి ఏమిటి?



ఐదేళ్లుగా అనారోగ్యంతో ఉన్నాను. మంచంపై నుంచి లేవలేను. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ప్రతీ నెలా ఇంటికే పింఛన్ వచ్చేది. ఇప్పుడు వలంటీర్లు ఇంటికి రాకుండా ఏవో కేసులు పెట్టారట. మా ఇల్లు ఇందిరా కాలనీలో కొండపై ఉంది. కొండ దిగి సచివాలయానికి పింఛన్ కోసం ఎలా వెళ్లగలను? మాలాంటి వారి పరిస్థితి ఏమిటి?

– సూరిబాబు, ఇందిరాకాలనీ, 60వ వార్డు

ఎలా వెళ్లగలను?



నాకు వచ్చిన వ్యాధి కారణంగా రెండు కాళ్లు తొలగించారు. దీంతో కొంతకాలంగా మంచంపైనే ఉంటున్నాను. గత ప్రభుత్వం నాకు పింఛన్ ఇవ్వలేదు. జగన్‌బాబు ప్రభుత్వంలో ఐదేళ్లుగా ప్రతీ నెలా పింఛన్ ఇంటికే వస్తుంది. ఈ నెల ఎలా వెళ్లగలను? నాలాంటి వారిని ఇలా బాధపెట్టకూడదు.

– ఎం.నూకాలమ్మ, మల్కాపురం, 61వ వార్డు

దేవుడా.. పింఛన్ ఎలా?



అనారోగ్యం కారణంగా మంచంపైనే ఉన్నాను. వలంటీర్ కూతురిలా వచ్చి పింఛన్ ఇచ్చేది. ఆ పింఛన్‌తోనే నా జీవనం సాగేది. అలాంటి వారి సేవలను అందకుండా చేశారు. మంచం దిగి నడవలేని నాకు పింఛన్ ఎవరిస్తారు? దేవుడా? నీవే దారి చూపించాలి.

– ఆరిపాక అమ్మాజీ, రామ్‌నగర్, 58వ వార్డు

ఇది సరికాదు



వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన నాటి నుంచి నేటి వరకు మాలాంటి వాళ్లకు ఎలాంటి కష్టం రాకుండా వలంటీర్ల ద్వారా సేవలు అందించారు. కరోనా లాంటి పరిస్థితుల్లోనూ మేం బయటికి వెళ్లకుండా అన్ని సేవలు వారి ద్వారానే ఇంటికి అందించేవారు. మొన్నటి వరకు ఒకటో తేదీన తెల్లారితే తలుపు ముందు వలంటీర్ ఉండి పింఛన్ ఇచ్చేవారు. ఆ సేవలు అందకుండా చేశారు. ఇది సరికాదు.

– బేతా ప్రతాప్‌రాజు, వృద్ధుడు, జ్ఞానాపురం

రాజకీయం చేయవద్దు



వలంటీర్ వ్యవస్థ చాలా బాగుంది. దీన్ని రాజకీయం చేయవద్దు. ఈ వ్యవస్థపై అపోహలతో టీడీపీ ఫిర్యాదు చేసిందట. జగన్ చేసిన మంచి మాత్రమే ఓటర్లపై ప్రభావితం చూపిస్తుంది తప్ప.. వలంటీర్లు కాదు. ఇపుడు వారి సేవలు నిలిపి వేస్తే చాలా ఇబ్బంది పడతాం. సేవా దృక్పథంతో చేస్తున్న సేవలకు విఘాతం కల్గించవద్దు. వారి సేవలు కచ్చితంగా ప్రజలకు అవసరం

– ఎన్‌వీ రమణమూర్తి, వృద్ధాప్య పెన్షనర్, రెడ్డి వీధి

జగన్ ప్రభుత్వం ఏర్పాటు చారిత్రక అవసరం



62వ వార్డు ప్రకాష్‌నగర్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న బల్ల లక్ష్మణరావు



40వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న పిల్లా రమాకుమారి



ప్రచారంలో మాలతి, పేడాడ రమణికుమారి

సింధియా : జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చారిత్రక అవసరమని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వస్తేనే దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం అవుతాయని జీవీఎంసీ 62వ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు బల్ల లక్ష్మణరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం 62వ వార్డు పరిధి అల్లూరి సీతారామరాజు కాలనీ, త్రినాథపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ఫ్యాను గుర్తుపై ఓటు వేసి ఆడారి ఆనంద్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. హామీలను నూటికి నూరు శాతం అమలు చేసిన జగన్‌ను మళ్లీ గెలిపించుకుంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా ఆనంద్‌కుమార్‌ను, ఎంపీగా బొత్స ఝాన్సీని అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొట్టి గణేష్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ఆయా పోలింగ్ బూత్‌ల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

40వ వార్డులో..

సింధియా : గత పాలకుల తీరుతో సర్వం కోల్పోయిన పేదలను ఆదుకుంటూ కుల, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి అన్నారు. జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీకాలనీ, కాకరలోవలో వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. జన బలమే గీటురాయిగా, సామాజిక న్యాయమే పరమావధిగా, గెలుపే లక్ష్యంగా శాసనసభ, లోక్ సభ స్థానాలకు పోటీ పడుతున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉన్నారన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని అన్నారు. పేదలకు, పెత్తందారులకు మధ్య జరిగే యుద్ధంలో న్యాయమే గెలుస్తుందని, 175 స్థానాలకు, 175 స్థానాలు వైఎస్సార్‌సీపీ గెలిచి దేశంలో చరిత్ర సృష్టించనుందన్నారు. పేదలకు సేవ చేసే భాగ్యాన్ని తమ్ముడు ఆడారి ఆనంద్‌కుమార్‌కు ఇవ్వాలని, ఫ్యాను గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఆనంద్‌కుమార్‌ను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కోట్నాన రవి, స్థానిక నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

90వ వార్డులో..

విశాఖ విద్య : జీవీఎంసీ 90వ వార్డులో వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ విజయాన్ని కాంక్షిస్తూ అతని భార్య మాలతి, నియోజకవర్గ అబ్జర్వర్ పేడాడ రమణికుమారి స్థానిక నాయకులతో కలిసి మంగళవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. వార్డు పరిధిలోని వినోదనగర్‌లో ఇంటింటికీ తిరిగి ఆనంద్ కుమార్‌ను గెలిపించాలని కోరారు. ఏ కష్టమెచ్చినా అండగా నిలిచే ఆడారి ఆనంద్ కుమార్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే, మరింత సేవ చేస్తారన్నారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు నమ్మి శ్రీను, చుక్కా ప్రసాద్‌రెడ్డి, మహిళా నాయకురాలు కోనాల వినీత తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



92వ వార్డు 460 సచివాలయంలో రాజీనామా పత్రాలతో వలంటీర్లు



89వ వార్డు 467 సచివాలయంలో రాజీనామా పత్రాలను చూపుతున్న వలంటీర్లు

- 89, 92 వార్డుల పరిధిలో 51 మంది
- తమపై ఆరోపణలతో మనస్తాపం చెందామని వెల్లడి

గోపాలపట్నం: జీవీఎంసీ 89, 92 వార్డుల పరిధిలో పలువురు వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. తమపై అసత్య ఆరోపణలు చేస్తూ అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సేవాభావంతో విధులు నిర్వర్తిస్తున్నా, అక్కసుతో ఎన్నిక కమిషన్‌కు ఫిర్యాదు చేశారనే మనస్తాపంతో రాజీనామా చేస్తున్నామని పలువురు వలంటీర్లు తెలిపారు.

జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురం 460 సచివాలయం పరిధిలోని 21మంది వలంటీర్లు, 89వ వార్డు 467 సచివాలయం పరిధిలో 30 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామాలు చేశారు. తమ రాజీనామాలను ఆమోదించాలని సచివాలయ కార్యదర్శులను, అడ్మిన్లను కోరారు. తమను ఈ అవమానాల నుంచి తప్పించాలని విజ్ఞప్తి చేశారు. సేవా దృక్పథంతో పని చేయాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తమను నియమించారని, ఇంత కంటే మంచి ఉద్యోగాలు వస్తే వెళ్లాలని హితవు పలికారని చెప్పారు. సేవాభావంతో చేస్తున్న ఈ విధుల వల్ల తమ ఇంటి పరిసరాల్లో ఎన్నో కుటుంబాలతో అనుబంధం ఏర్పడిందని, వారి కష్టాలు, అవసరాలు తీర్చే అదృష్టం కల్పించారని చెప్పారు. ఇప్పుడు కొంతమంది కుతంత్రాలకు తాము బలవుతున్నామని, సేవ చేసే అదృష్టాన్ని కోల్పోతున్నామని ఆవేదన చెందారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకున్నాక ఉద్యోగంలో చేరతామని, ఆ రోజు నుంచి తమను ఆపేదెవరని ప్రశ్నించారు.

రాజీనామా చేసిన అనంతరం జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావును కుమారి కల్యాణ మండపంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తామంతా రాజీనామాలు చేశామని, ఇక నుంచి ఎమ్మెల్యేగా ఆడారి ఆనంద్ కుమార్‌ను, ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించేందుకు కష్టపడతామని తెలిపారు.

అవకాశమివ్వండి.. అండగా ఉంటా

ఎన్నికల ప్రచారంలో పశ్చిమ అభ్యర్థి ఆనంద్‌కుమార్



59వ వార్డు ప్రచారంలో ఆనంద్‌కుమార్‌కు తిలకం దిద్దుతున్న మహిళ



ఆనంద్ గెలవాలని ఆశీర్వదిస్తున్న వృద్ధురాలు



నరసింహనగర్‌లో వృద్ధురాలిని ఓటు వేయాలని కోరుతున్న ఆడారి ఆనంద్‌కుమార్



ఇందిరానగర్‌లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న బెహరా భాస్కరరావు

మల్కాపురం : తనను నమ్ముకున్న వారిని ప్రేమించటం తప్ప వంచించటం చేతకాదని, తన తండ్రి ఆడారి తులసీరావు ఆపద అన్న వారికి సాయం అందించాలనే విషయం నేర్పారని వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 59వ వార్డు హిమాచల్‌నగర్ కొండ ప్రాంతాల్లో మంగళవారం ఇంటింటి ప్రచారం చేశారు. వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీయాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ కరోనా వంటి కష్టకాలంలో కూడా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదలను విస్మరించలేదన్నారు. అందుకే జగన్ వెంట జనం నిలబడ్డారన్నారు. జగన్‌కు పెరుగుతున్న ప్రజాదరణను చూడలేక చంద్రబాబు, పవన్ కల్యాణ్ తప్పుడు ప్రచారాలు చేస్తూ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు, పవన్‌కు పేదలంటే గిట్టదని, అందుకే పేదల ముంగిళ్లకు వెళ్లి పింఛన్లు అందజేసే వలంటీర్లపై కక్ష కట్టారన్నారు. పెన్షన్ పథకాన్ని అడ్డుకుని అవ్వాతాతల ఉసురు పోసుకుంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్, వార్డు పార్టీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ, అమరావతి, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

92వ వార్డులో ఆనంద్ ప్రచారం..

గోపాలపట్నం : పశ్చిమలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ ప్రచారం ఊపందుకుంది. జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం జీవీఎంసీ 92వ వార్డు ఇందిరానగర్, నరసింహనగర్ ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు ప్రచారం కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఆడారి ఆనంద్‌కుమార్ పాల్గొని ఓటర్లను కలిసి తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తన దృష్టికి వచ్చిన పలు సమస్యల్ని పరిష్కరించానని తెలిపారు. రహదారులు, కమ్యూనిటీ హాళ్లు, కాల్వలు నిర్మించినట్లు తెలిపారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని తెలిపారు. గతలో ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి నాలుగేళ్లు కనిపించలేదని, ఇప్పుడు ఎన్నికలు వచ్చాయని మళ్లీ జనాల్లోకి వస్తున్నారని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ వస్తే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని.. వారు రాక ముందే వలంటీర్లను ఆపేశారన్నారు. దీంతో అవ్వాతాతలు, వికలాంగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. భవిష్యత్తులో వలంటీర్ల బదులు జన్మభూమి కమిటీలు వస్తాయన్నారు. వారు దోచుకు తినడానికే పని చేస్తారని దుయ్యబట్టారు. ఇలాంటి వారిని దగ్గరికి కూడా రానివ్వొదని అన్నారు. అవినీతి లేని జగనన్న పాలనే మళ్లీ రావాలని, అందుకు అంతా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 91, 92 వార్డుల అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పల స్వామి నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ, యువజన విభాగం క్లస్టర్-4 అధ్యక్షుడు శరగడం సురేష్, ఊటపల్లి గోవిందు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాబు బ్యాచ్ గుండెల్లో రైళ్లు



మాట్లాడుతున్న ఎస్‌ఏ రెహమాన్, పీలా ఉమారాణి

మల్కాపురం : నాడు ఏ పథకం పొందాలన్నా, ఏ పని చేయించుకోవాలన్నా కార్యాలయాల చుట్టూ ప్రజలు కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదని, జగనన్న ప్రభుత్వం వచ్చాక అటువంటి అవస్థలు తప్పాయని వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎన్నికల పరిశీలకులు ఎస్‌ఏ రెహమాన్, పీలా ఉమారాణి అన్నారు. అవ్వాతాతలు, దివ్యాంగులకు వలంటీర్లు ఇంటికి వెళ్లి పెన్షన్ అందించే వెసులుబాటును చంద్రబాబు అడ్డుకున్న తీరును నిరసిస్తూ 59వ వార్డు వైఎస్సార్‌సీపీ క్యాంప్ కార్యాలయం వద్ద మంగళవారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసి పేదల ముంగిళ్లకు సంక్షేమాన్ని అందించిన నాయకుడు సీఎం జగన్ మోహన్‌రెడ్డి అని కొనియాడారు. రాష్ట్రంలో జగన్ ప్రభంజనానికి టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. అందుకే దిగజారుడు రాజకీయాలకు సిద్ధపడ్డారన్నారు. రాష్ట్రంలో సుమారు 66 లక్షల మంది పింఛన్‌దారుల ఇళ్లకు నేరుగా వెళ్లి 1వ తేదీ తెల్లవారి 5 గంటలకే పింఛన్లు అందిస్తున్న వలంటీర్ వ్యవస్థపై పడ్డారన్నారు. వారి ఆగడాలతో వృద్ధులు, దివ్యాంగుల పొట్ట కొడుతున్నారని విమర్శించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విశాఖలోని 7 అసెంబ్లీ స్థానాలను తమ పార్టీ అభ్యర్థులు కైవశం చేసుకుంటారన్నారు. ఎన్నికల్లో గెలవకముందే వలంటీర్ వ్యవస్థను పని చేయకుండా చేయడం ద్వారా పేదలకు సంక్షేమాన్ని దూరం చేసిన టీడీపీ బ్యాచ్ తీరును ప్రజలు గుర్తించాలన్నారు. వాళ్లే గనుక అధికారంలోకి వస్తే సచివాలయ వ్యవస్థ, వలంటీర్లను ఉంచుతారా? అని ప్రశ్నించారు. ట్రేడ్ యూనియన్ రీజినల్ కో-ఆర్డినేటర్ బద్రీనాథ్, కార్పొరేటర్ గులిగిందల లావణ్య, ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్ పాల్గొన్నారు.